క్లుప్తంగా

రేషన్‌దుకాణం తనిఖీ



తనిఖీ చేస్తున్న డీటీ శివకుమార్

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలోని రేషన్ దుకాణాన్ని మణుగూరు సివిల్ డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. రేషన్‌షాపునకు వచ్చిన బియ్యం లబ్ధిదారులకు అమ్మిన స్టాక్ పరిశీలించారు. ఈ నెల 30 వరకు మూడు నెలల రేషన్‌బియ్యం లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

జ్వర సర్వే



రక్త నమూనాలను సేకరిస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: మండలంలోని లంకమల్లారం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జ్వర సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటిని సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించి మందులను అందించారు. నిల్వ నీటిని తొలగించారు. సిబ్బంది రాంప్రసాద్, సుమ, శైలజ, భవాని ఉన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వాపురం: మండలంలో ఎమిలీ పాఠశాలలో ఉచిత విద్యకు ఈ నెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వితంతువు, ఒంటరి మహిళ, పురుషుడు, ఎవరి సంరక్షణలో అయినా పిల్లలు పెరుగుతున్నట్లయితే మండలంలో ఎక్కడి నుంచైనా పాఠశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుండి 7వ తరగతి వరకు ఉచితంగా విద్య అందిస్తామని తెలిపారు. వివరాలకు 9912467858, 9182202087 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు..

బూర్గంపాడు: సారపాకలోని మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జే.జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు 30 సీట్లు, ఎస్టీలకు 3, ఓసీలకు ఒక్క సీటు ఉన్నాయని, వివరాలకు 7331125355 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సన్మానం

చర్ల: మండలంలోని కుదునూరు గ్రామానికి చెందిన టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ టీపీసీసీ జనరల్ సెక్రటరీగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం చర్లలో ఆయనను ఘనంగా సత్కరించారు. చర్లలోని కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

దుమ్ముగూడెం: టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్‌కి జనరల్ సెక్రటరీ పదవి రావడం హర్షనీయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరమాచినేని వినీల్ అన్నారు. 35 ఏళ్లగా దుర్గాప్రసాద్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఆ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

యాదవ సంఘం హర్షం

దమ్మపేట: టీపీసీసీ జనరల్ సెక్రటరీగా కొత్తగూడెంకు చెందిన నాగ సీతారాములు ఎంపిక కావడంపై దమ్మపేట మండల యాదవ సంఘం తరపున హర్షం వ్యక్తం చేశారు. నాయకులు జోనబోయిన శ్రీనివాసరావు, రాజేశ్వరరావు, సాయిల నర్సి, హరిబాబు, మల్లేశ్వరరావు, వేణు, వెంకటేశ్వరరావు, భవాని కృష్ణ, మల్లయ్య పాల్గొన్నారు.

సబ్ కంట్రోల్ రూంను పునరుద్ధరించాలి

మణుగూరు రూరల్ : మండలంలోని పీవీకాలనీలో పోలీస్ సబ్ కంట్రోల్ రూంను పునరుద్ధరించాలని టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ కోరారు. ఈ మేరకు మంగళవారం మణుగూరు సీఐ పాటి నాగబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో సింగరేణి అభివృద్ధిలో శ్రమిస్తున్న సింగరేణి కార్మికుల కష్టార్జితం దొంగల పాలు కాకుండా సబ్ కంట్రోల్ రూంని పునరుద్ధరించి పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, హరీష్, బోడ రమేష్‌బాబు, గుగులోత్ రమేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..

పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు

- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు
- సమగ్ర ప్రణాళిక, వైద్యశిబిరాల ఏర్పాటుపై వైద్యారోగ్య శాఖ దృష్టి



దోమల నియంత్రణ ద్రావణం చల్లుతున్న ఆశా కార్యకర్తలు

కరకగూడెం: ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అనేక వ్యాధుల ప్రమాదం కూడా పొంచి ఉంది. తేమతో కూడిన వాతావరణం, నిలిచిన నీరు, సూర్యరశ్మి తక్కువగా ఉండటంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువ. ఈ వ్యాధుల నుండి రక్షణ పొందేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యాధికారుల సూచనలు, ప్రణాళికలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటికే వైద్యాధికారులు గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి అనుమానితుల నుండి రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అంతేకాకుండా మలేరియాను సమర్థవంతంగా అరికట్టేందుకు జూన్ నెలను 'యాంటీ మలేరియా నెల'గా అధికారులు ప్రకటించారు. ఈ నెల పొడవునా మండల వ్యాప్తంగా మలేరియా నివారణ, నియంత్రణ చర్యలను ముమ్మరం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగానే అప్రమత్తమై ప్రజల్లో అవగాహన కల్పించడం, నివారణ చర్యలు చేపట్టడంతో మలేరియాను సమూలంగా నిర్మూలించవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చేతులను సబ్బుతో తరచూ కడుక్కోవాలి. ఇంటిని శుభ్రంగా పొడిగా ఉంచడం కూడా అవసరం.
- తాగే నీటిని కాచి, ఫిల్టర్ చేసి లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలి.
- ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూడటం, దోమతెరలు, దోమల నివారణ మందులు, పొడవాటి చేతుల దుస్తులు ధరించడంతో రక్షణ పొందవచ్చు.
- రోగనిరోధక శక్తిని పెంచే ఆహార పదార్థాలు పండ్లు, కూరగాయలను రోజువారీ భోజనంలో చేర్చుకోవాలి. తాజా శుభ్రమైన ఆహారం తీసుకోవడంతో ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు.
- జ్వరం, గొంతు నొప్పి, చర్మ సమస్యలు లేదా ఇతర లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి. స్వీయ చికిత్సను నివారించాలి.

వైద్యారోగ్య శాఖ ప్రణాళిక..

వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రణాళికలో భాగంగా పలు కార్యక్రమాలు అమలు చేయబడుతున్నాయి.

- ➡ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, ఉచిత వైద్య పరీక్షలు, రక్త నమూనాల సేకరణ, ఔషధాల పంపిణీ చేయనున్నారు.
- ➡ దోమల వృద్ధిని నియంత్రించేందుకు ఫాగింగ్, నీటి నిల్వ ప్రాంతాల్లో లార్వా నియంత్రణ రసాయనాల వాడకం, దోమతెరల పంపిణీ వంటి చర్యలు చేపడుతున్నారు.
- ➡ సీజనల్ వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి జ్వర బాధితుల సమాచారాన్ని అందిస్తున్నారు.
- ➡ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగీ, మలేరియా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం, అవసరమైన ఔషధాలను నిల్వ చేయడం జరుగుతోంది. ఆరోగ్య శాఖ అధికారులు పంచాయతీ, అధికారులతో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నీటి నిల్వను తొలగించడం, కాల్వల శుభ్రత, చెత్త సేకరణపై దృష్టి సారిస్తున్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో ఉన్న చికిత్సలు, ఉచిత సేవలు గురించి తెలియజేయాలి. పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల మానసిక ఆరోగ్యానికి కూడా దోహదపడతాయి. పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలి.

– మాడివి బన్ని, అంగోరుగూడెం

ఆరోగ్యంపై చైతన్య పరచాలి



వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధుల భయం మొదలవుతుంది. ఈ వ్యాధుల నుంచి మమ్మల్ని కాపాడడానికి అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. నివారణ చర్యలు ఏమిటో, వాటిని ఎలా పాటించాలో వివరంగా చెప్పాలి.

– కొమరం సుగుణ, మొగిలితోగు

వ్యాధుల కట్టడికి ప్రణాళిక



సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పరిశుభ్రతే ముఖ్యం. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం చాలా అవసరం. ఏ చిన్న అనారోగ్య లక్షణం కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. సీజనల్ వ్యాధులపై సమగ్ర ప్రణాళిక రూపొందించాం.

– రవితేజ, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ

ఐదు పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ సర్వీస్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐ, డీఎం

అశ్వారావుపేటరూరల్: సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి ఏపీలోని ఐదు పుణ్యక్షేత్రాలకు భక్తుల కోసం ప్రత్యేకంగా బస్‌సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు డిపో మేనేజర్ ఎం.రాజ్యలక్ష్మీ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సీఐ పింగళి నాగరాజురెడ్డితో కలిసి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి సత్తుపల్లిలో బయలుదేరి ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని మద్ది ఆంజనేయ స్వామి ఆలయం, ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయం, వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, పెనుగొండలోని శ్రీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయం, ద్వారకా తిరుమల ఐదు పుణ్యక్షేత్రాలను సందర్శించి ఇదే రోజు రాత్రి 10 గంటలకు సత్తుపల్లికి చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విలేజ్ బస్ ఆఫీసర్ ఆనందరావు, కంట్రోలర్ ఎన్‌వీఎస్‌రావు, రిటైర్డ్ డ్రైవర్ కేవీ రావు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

అశ్వాపురం: పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. 16 నెలలుగా పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోయినా నిధులు రాకపోయినా ప్రజలకు అసౌకర్యం కలగకుండా సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరవేస్తున్నామని, భవిష్యత్‌లోను అదే స్ఫూర్తితో పని చేస్తామని వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లేష్, తౌఫిక్, ప్రవీణ్, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్, పాస్ చార్జీ ధరలు తగ్గించాలి

దుమ్ముగూడెం: పెంచిన బస్, బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులు లంక శివ, వాగే కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్‌చార్జీలు పెంచడంతో పేద విద్యార్థులపైన ఆర్థిక భారం పడుతుందని ఒక్కొక్క విద్యార్థిపై రూ.250 నుంచి 350 వరకు పడుతుందన్నారు. ఒక వైపు మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పెట్టి బస్సులను తగ్గించి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ మరో పక్క చార్జీలు పెంచి విద్యార్థులపై ఆర్థికభారం మోపుతుందన్నారు.


శ్రీహరికి మంత్రి పదవిపై హర్షం

మణుగూరు టౌన్: ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికు మంత్రి పదవి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, సోనియాగాంధీ చిత్రపటాలకు మంగళవారం ముదిరాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. వెంకటేశ్వర్లు, రాములు, రాఘవులు, నాగేశ్వరరావు, ముత్తిలింగం, కృష్ణ, సాధనాల వినోద్, శ్రీశైలం, గురుమూర్తి, వీరయ్య, రాంబాబు, నాగులు, ఆముదాల శ్యామల తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న 'బడిబాట'

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చేపడతున్న బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో ర్యాలీలతో ప్రచారం నిర్వహించారు. పాఠశాలల్లో అందుతున్న విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు.


– సాక్షి నెట్‌వర్క్



బూర్గంపాడు: ఐటీడీఏ ఆధ్వర్యంలో



భద్రాచలంఅర్బన్: అంగన్‌వాడీ ఆధ్వర్యంలో..



అశ్వారావుపేటరూరల్: వడ్డెర రంగాపురంలో..

అన్నదానం



మణుగూరు టౌన్: వాసవీక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుళ్ల రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మణుగూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు అమ్మానాన్న వృద్ధాశ్రమంలో క్లబ్ అధ్యక్షులు శ్యామ్, వనితా వైభవం అధ్యక్షురాలు బొగ్గవరపు అంజలి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐపీసీ బండారు నర్సింహారావు, జిల్లా జాయంట్ సెక్రటరీ చిట్టూరు శేషుబాబు ఉన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ చర్చ్ ప్రాంతంలో జీబీఎం జీసస్ లివింగ్ వాటర్ ప్రాజెక్ట్స్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోర్‌ను మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ ప్రారంభించారు. అనంతరం బోర్ ఏర్పాటు చేసిన జీబీఎం సంస్థ వారిని అభినందించారు. కాంగ్రెస్ యూత్ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు గాండ్ల సురేష్, త్రిమూర్తులు, వెంకటేశ్వర్లు, ఫాస్టర్లు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్యే వెంకట్రావు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలంటౌన్: రైతులు గతంలో ఉన్న ధరణి పోర్టల్‌తో అనేక ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక రైతువేదికలో మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మంగళవారం ఎమ్మెల్యే పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధరణితో రైతులు భూముల సమస్యలతో పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయంతో పాటు డబ్బులను వృథా చేసుకున్నారన్నారు. భూ భారతితో ప్రతీ సమస్య పరిష్కారమవుతుందని ప్రతీ ఒక్కరు భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండ ఎర్రజెండానే..

- ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి
- సీపీఐ నేతలు హేమంతరావు, సాబీర్ పాషా



మాట్లాడుతున్న హేమంతరావు



మండల కార్యదర్శిగా ఎన్నికైన పోతయ్య

చర్ల: నాటి నుండి నేటి వరకు పేదలకు ఎర్రజెండా అండగా నిలుస్తోందని.. నూరేళ్ల ఉత్సాహంతో మరిన్ని సమరశీల పోరాటాలు నిర్వహిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. పార్టీ మండల 20వ మహాసభ మంగళవారం మార్కెట్ సముదాయంలో జరగగా, పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు నూప తిరుపతి ఆవిష్కరించాక అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఆడ్డగర్ల తాతాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం మాట్లాడుతూ భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా వందేళ్లుగా అలుపెరగని పోరాటాలు సాగిస్తోందని తెలిపారు. అటవీ హక్కులు, ఉపాధి హామీ చట్టం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలతోనే వచ్చాయని పేర్కొన్నారు. కాగా, పోడు భూములకు పట్టాలు, ఏజెన్సీ విద్యార్థులకు కులధ్రువీకరణ పత్రాల మంజూరు, పెసా చట్టం అమలు, సాగునీటి ప్రాజెక్టులు మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆపరేషన్ కగార్ పేరుతో అడవుల్లో సృష్టిస్తున్న నరమేధాన్ని నిలిపివేయాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్ భాష మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు, నూపా పోతయ్య, నూప తిరుపతిరావు, పాలంచ రామారావు, పాలెం సత్యనారాయణ, నానిపల్లి భద్రం, మంగమ్మ, ఉప్పులూరి నాగరాజు, గుంజి మాల్యాద్రి. పొడియం ఆదిలక్ష్మి, కాకర్ల అనసూయ, కోడిరెక్కల రాజారావు, ఆంద్రు, వామనరావు, చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావు, ఉప్పులూరి వెంకటనర్సమ్మ, కల్లూరి సీతారాములు, కట్టం నాగేశ్వరరావు, కట్టం ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ చర్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులుగా చల్లా లక్ష్మీనారాయణ, కోటి ముత్యాలరావులతో పాటు 19 మంది కార్యవర్గ సభ్యులు, 55 మంది మండల కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

నిందితులను శిక్షించాలి

చర్ల: భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీకి చెందిన గిరిజన యువకుడు కనితి సతీష్‌ను దారుణంగా హతమార్చిన దుండగులకు కఠినంగా శిక్షించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ గొంది ముయ్యన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. హత్య చేసే సందర్భంలో అడ్డొచ్చిన కుటుంబ సభ్యులను దారుణంగా కొట్టారని ఈ ఘటనలో పాల్గొన్న సుమారు 40 మందికి ఖచ్చితంగా శిక్షపడేలా పోలీసులు కృషి చేయాలని కోరారు. నాయకులు యాలం నర్సింహారావు, కుర్సం జగన్, మడివి కృష్ణ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న జిల్లా బాధ్యులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో నాయీబ్రాహ్మణ సంఘం మండల కమిటీ ఎన్నికను మంగళవారం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా పొడకలపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా రామవరపు మధు, కార్యదర్శిగా శంకరి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సభ్యులు పోడకలపల్లి రాము, కన్నయ్య, పోడకలపల్లి శ్రీను, సభ్యులు రమేష్, దుర్గాప్రసాద్, వీరయ్య , నాగార్జున, సమరాజు, సోను, కును ఉన్నారు.

సేవాలాల్ సేన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

బూర్గంపాడు: సేవలాల్ సేన మండల నూతన కమిటీని మంగళవారం సేవలాల్ సేన రాష్ట్ర కోఆర్డినేటర్ బానావత్ హుస్సేన్‌నాయక్ ఆధ్వర్యంలో సారపాకలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గుగులోత్ రాంబాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్యా సురేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా వీరబాబు, అధికార ప్రతినిధిగా బానావత్ రత్నకుమార్, పట్టణ అధ్యక్షులుగా అంగోత్ రఘు, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ శంకర్, ఉపాధ్యక్షులుగా బాదావత్ నాగరాజు, కార్యదర్శిగా బానోత్ రంగా, ప్రచార కార్యదర్శిగా లకావత్ హరిలాల్‌లను ఎన్నుకున్నారు.

వ్యవసాయ కళాశాలలో జాబ్‌మేళా

అశ్వారావుపేటరూరల్: స్థానిక వ్యయసాయ కళాశాలలో వీవీసీ ట్రాక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీవీసీ గ్రూప్ సీఈవో పుట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు తమ కంపెనీలో ఉండే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించి అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.రమేష్, అశోక్, మాధవి, స్పేర్ మేనేజర్ సతీష్ ఉన్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం..

- పూడికతో నిండిపోయిన డ్రెయినేజీలు
- దుర్వాసనతో తప్పని తిప్పలు..
- పట్టించుకోని అధికారులు



రోడ్లపై పేరుకుపోయిన చెత్త



మరమ్మతులకు గురైన ట్రాక్టర్

దుమ్ముగూడెం: మండలంలోని ప్రధాన వ్యాపార సముదాయాలైన లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. కొన్ని రోజులుగా చెత్త సేకరణకు పంచాయతీ ట్రాక్టర్లు రాకపోవడంతో దుకాణాల ముందు, ఇళ్ల ఎదుట చెత్త పేరుకుపోయింది. దీంతో పశువులు, కుక్కలు చిందరవందర చేస్తుండటంతో మురుగు వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా డ్రెయినేజీలు పూడికతో నిండిపోవడంతో మురుగునీరు పోయే పరిస్థితి కన్పించడం లేదు. డ్రెయినేజీల్లో పూడికను తొలగించకపోవడంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. డ్రెయినేజీలో శుభ్రం చేయకపోతే వర్షాలు మొదలైతే మురికి నీరు రోడ్లపై పొంగిపొర్లుతోంది. ఇప్పటికే కురిసిన వర్షాలకు మురుగునీరు రోడ్లపైకి రావడంతో ఆయా ప్రాంతాలు దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. పంచాయతీలో రోజు వారీ చేసే పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా పరిస్థితి నెలకొంది. పది జులుగా పంచాయతీ ట్రాక్టర్లు చెత్త సేకరణకు రాకపోవడంతో రోడ్లపై చెత్త పేరుకుపోతుంది. తో ప్రజలు తమ ఇళ్ల ముందు చెత్తను మంట పెట్టి తగలబెడుతున్నారు దీంతో పొగ బాగా వ్యాపించి ఇబ్బంది పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అదేవిధంగా ఈ రెండు గ్రామాల్లో ప్రధాన రహదారిపై విద్యుద్దీపాలు వెలగక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు.

పనిచేయని లక్ష్మీనగరం ట్రాక్టర్..

లక్ష్మీనగరం పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురికావడంతో పాటు డీజిల్‌కు డబ్బులు లేపదిరోజులుగా చెత్త సేకరణకు రాక హోటళ్లు, ఇళ్లు, దుకాణాల ముందు చెత్త భారీగా పేరుకుపోయింది. దీంతో పాటు పంచాయతీ కార్యదర్శి డిప్యూటేషన్‌పై వేరే పంచాయతీకి వెళ్లడంతో రోజువారి కార్యక్రమాలను పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలో ప్రధాన వ్యాపార సముదాయాలుగా ఉన్న లక్ష్మీనగరం, ములకపాడు పంచాయతీల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా మారుమూల గ్రామ పంచాయతీల పరిస్థితి ఎంత అధ్వానంగా ఉంటుందో అని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ మరమ్మతులకు గురైంది

లక్ష్మీనగరం పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురికావడంతో చెత్త సేకరణకు రావడం లేదు. అందుబాటులో స్థానిక ట్రాక్టర్ మెకానిక్ లేదు ట్రాక్టర్ మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం.

– బద్ది రామకృష్ణ, ఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ